గల్ఫ్ ఎయిర్ విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్ నుంచి వస్తున్న విమానాన్ని పేల్చేస్తామంటూ గుర్తుతెలియని దుండగులు ఆదివారం జీఎంఆర్ కస్టమర్ సపోర్టుకు మెయిల్ పంపారు. 154 మంది ప్రయాణికులతో బహ్రెయిన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న గల్ఫ్ ఎయిర్ 274 విమానాన్ని బాంబుతో పేల్చేస్తామంటూ దుండగులు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు మెయిల్ పంపడంతో కస్టమర్ సపోర్ట్ అధికారులు భద్రతా బలగాలకు సమాచారమిచ్చాయి. దీంతో విమానాన్ని ముంబైకి దారి మళ్లించారు. అక్కడ డాగ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించాక బాంబు లేదని తేల్చారు. తిరిగి విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉదయం 11.30 గంటలకు చేరుకుంది.

సీఎంకు ఘన స్వాగతం



సీఎం రేవంత్‌కు స్వాగతం పలుకుతున్న ఫ్యూచర్‌సిటీ ఎండీ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి

- మీర్‌ఖాన్‌పేటకు విచ్చేసిన రేవంత్
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన
- అధికారులకు కీలక ఆదేశాలు
- రెండున్నర గంటల పాటు అక్కడే..

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 పనులను పరిశీలించేందుకు ఆదివారం మీర్‌ఖాన్‌పేటకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. కందుకూరు మండలంలోని భారత్ ఫ్యూచర్‌సిటీలో డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పనులను కొద్దిరోజులుగా నేరుగా పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతపురంలో జరుగుతున్న శ్రీసత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ నుంచి నేరుగా మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఫ్యూచర్ సిటీకి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. సీఎం రాకకోసం ఇక్కడ ప్రత్యేక హెలీపాడ్ నిర్మించారు. మీర్‌ఖాన్‌పేటకు చేరుకున్న సీఎంకు కలెక్టర్ నారాయణ రెడ్డి, ఫ్యూచర్‌సిటీ ఎండీ శశాంక, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మధు యాష్కీ, మల్‌రెడ్డి రామిరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఆయా శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లు జరుగుతున్న ప్రాంతాలను తిరిగి వాటిని పరిశీలించారు. అలాగే ఇక్కడ జరుగుతున్న స్కిల్ యూనివర్సిటీ నిర్మాణాలు, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథార్టీ భవన సముదాయ పనులను పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమ్మిట్‌కు సంబంధించి పలు విషయాలపై అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఫ్యూచర్ సిటీకి మూడు రాష్ట్రాల రాజధానులు నేరుగా అనుసంధానం చేస్తూ కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మిస్తున్నందున ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి సాధిస్తుందని స్థానిక నేతలకు సీఎం తెలిపారు. దాదాపు రెండున్నర గంటల పాటు సీఎం పర్యటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు చల్లా నర్సింహ్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.



రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పనులను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాగిందిలా

- మధ్యాహ్నం 12 గంటలకు ఫ్యూచర్‌సిటీ అథారిటీ ఎండీ శశాంక సమ్మిట్ పనుల వద్దకు చేరుకున్నారు.
- 2:09 గంటలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వచ్చారు.
- 2:25 సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌పై కందుకూరుకు చేరుకున్నారు.
- 2:39 గంటలకు మీర్ఖాన్‌పేటలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ పనుల వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు.
- 3:57 గంటల వరకు అధికారులు, శాసనసభ్యులతో కలిసి సమ్మిట్ పనుల ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో సీఎం పరిశీలించారు.
- 3:58గంటలకు స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్‌సిటీ కమిషనర్ కార్యాలయ భవనాల పనులను పరిశీలించడానికి సీఎం వెళ్లారు.
- 4:38 గంటలకు సీఎం కాన్వాయ్ హైదరాబాద్‌కు బయలుదేరింది.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం..

- వారి ఆశీర్వాదంతోనే ఉప ఎన్నికలో విజయం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కలెక్టరేట్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి చీరలు ఆడపడుచులకు చీర, సారె లాంటివని, మహిళల ఆర్థికంగా బలోపేతం చేస్తూ వారిని ఉన్నత స్థానంలో నిలపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆయన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్, హ్యాండీక్రాఫ్ట్స్ సహకారంతో నాణ్యమైన చీరలు ఆడపడుచులకు అందజేస్తున్నామన్నారు. ఇందిరాగాంధీ శత జయంతి సందర్భంగా రాష్ట్రంలో దాదాపు కోటి మంది మహిళలకు చీరల అందజేస్తామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు అలాగే 18 ఏళ్ల నిండిన ఆడపడుచులందరికీ ఈ చీరలు అందజేస్తున్నామన్నారు. గ్రామ, మండల సమాఖ్య బాధ్యులు ప్రతి మహిళకు చీర అందేలా చూడాలని సూచించారు. మొదట గ్రామీణ ప్రాంత మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. వచ్చే జనవరి తర్వాత పట్టణ ప్రాంత మహిళలకు కూడా అందజేస్తామన్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణమెందుకంటూ కొందరు మాట్లాతున్నారని, అలాంటి వారికి మహిళలే బుద్ధి చెప్పాలన్నారు. ఆర్టీసీపై పడుతున్న భారాన్ని రూ.400 కోట్లు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మహిళల ఆశీర్వాదంతోనే ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించామని ఆయన గుర్తు చేశారు. మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం కొనసాగుతోందని, మరో మూడేళ్లలో మూడు విడతలుగా ఇళ్లు అందజేస్తామన్నారు. శాసన మండలి చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతోనే సోలార్ పవర్ ప్లాంట్‌లు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జీవనజ్యోతి జిల్లా మహిళా సమాఖ్య సంఘానికి 634.68 లక్షల చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యేలు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా మహిళా సమాఖ్య చైర్మన్ అశ్విని, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి మృత్యు కుహరంగా మారింది. ఈ రోడ్డు నిత్యం నెత్తురోడుతోంది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నిత్యం ఏదో ఒకచోట యాక్సిడెంట్లు జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మీర్జాగూడ స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం జరిగినప్పటి నుంచి ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే జనం జంకుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటం, మలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని ఏర్పాటు చేయడంతో పాటు త్వరితగతిన హైవే విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

హైవే టెర్రర్!

హైదరాబాద్ - బీజాపూర్ రహదారిపై ఆగని ప్రమాదాలు



ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న దృశ్యం (ఫైల్)



ప్రమాదంలో నుజ్జయిన కారు

- వరుసగా జరుగుతున్న యాక్సిడెంట్లు
- ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం మరువక ముందే చోటుచేసుకుంటున్న ఘటనలు
- ఆ మార్గంలో ప్రయాణమంటే వాహనదారుల బెంబేలు
- మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు
- హైవే విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజల వేడుకోలు

చేవెళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నిత్యం ఏదో ఒకచోట యాక్సిడెంట్లు జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ హైవే చాలా ఇరుకుగా ఉండడంతో గడిచిన ఎనిమిదేళ్లలో 393మంది చనిపోయారు. మరో 1008 మంది గాయాలపాలయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ రోడ్డు వెంబడి మొత్తం 60 మూలమలుపులు ఉన్నాయి. ఇందులో 10 అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా వరకు మూలమలుపుల వద్దనే

మిగతా 7వ పేజీలో...



ప్రారంభమైన హైదరాబాద్ -బీజాపూర్ రోడ్డు పనులు

రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా చేయాలి



హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ఆలస్యం చేయకుండా వేగవంతంగా పనులు కొనసాగించాలి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దారిలో జరిగిన ప్రమాదాల కారణంగా చాలామంది మృతి చెందగా, మరికొందరు గాయాలపాలయ్యారు. ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.

- బక్కరెడ్డి యాదిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మల్కాపూర్

పేదల సంక్షేమానికి

ప్రభుత్వం కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

7

నేడు గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసితులతో

ఎమ్మెల్యే సమావేశం

వివరాలు 7లో..



పాదయాత్రగా వెళ్తున్న దళిత సంఘాల నాయకులు

రాజశేఖర్ హత్యపై మెజిస్టీరియల్ విచారణ

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

షాద్‌నగర్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎర్ర రాజశేఖర్ అనే వ్యక్తి కిడ్నాప్, హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మొగిలిగిద్ద నుంచి ఎల్లంపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల దురహంకార హత్యలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తేవాలన్నారు. రాజశేఖర్ హంతకులను కఠినంగా శిక్షించాలని, రాజశేఖర్ సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం, బాధిత కుటుంబానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రాజశేఖర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక కన్వీనర్ దొడ్డి శ్రీనివాసులు, నాయకులు వెంకట్‌రాములు, నర్సింలు, బిక్షపతి, పీపీఎం రాజు, శ్రీనునాయక్, బుద్ధుల జంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు

వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున మహానగర సంకీర్తన, అనంతరం మహా రుద్రాభిషేకం చేశారు. గద్వాల పట్టణానికి చెందిన కాశీ విశ్వనాథ్ భగవతార్ సత్యసాయి దివ్య చరిత్రపై ప్రవచనం చేశారు. సాయంత్రం మహా భజన, స్వామి ఉయ్యాల సేవ, చిన్నారులతో కేక్‌ను కట్ చేయించారు. సత్యసాయి సేవా సమితి షాద్‌నగర్ కన్వీనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన శతజయంతి వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై మాట్లాడారు. మానవుడిగా పుట్టి మాధవుడిగా ఎదిగిన పుట్టపర్తి సాయిబాబా దేశ, విదేశాలలో గొప్ప సామాజిక సేవలు అందించారని గుర్తుచేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా విద్య, వైద్య సేవలతో పాటు తాగునీటిని అందించారని అన్నారు. సాయిబాబా ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు సేవామార్గాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నేత బండారి రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, పట్టణ ప్రముఖులు బెజుగం రమేష్, సారాపు జగదీశ్వర్, ఎం. వెంకటయ్యగౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కొత్తూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో జేపీ దర్గా రోడ్డులో ఉన్న వినాయక స్టీల్ పరిశ్రమలో పర్నాస్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై రమేష్‌పాండే(41) అనే కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన రమేష్‌పాండే కొన్ని సంవత్సరాల క్రితం కొత్తూర్‌కు వలస వచ్చి పరిశ్రమలో కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లిన అతను ఫర్నాస్ వద్ద విధులు నిర్వహిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని పేర్కొన్నారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉండగా, భార్య రితుదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



షాద్‌నగర్ బైపాస్ రోడ్‌లో కురుస్తున్న పొగమంచు



తుక్కుగూడ నుంచి కందుకూరుకు బస్సులో వెళ్తూ... చలికి వణుకుతున్న ప్రయాణికులు

చలి.. పులి!

జిల్లాలో చలి పంజా విసురుతోంది. ఈ ఏడాది అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం గజగజ వణికిపోతున్నారు. రాత్రి చల్లని గాలులు, ఉదయం వేళ మంచు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సాయంత్రం అయ్యేసరికి చలిలో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

ప్రేమున్న చోటే పరమాత్ముడు ..

● హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్


సత్యసాయి శత జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్

వికారాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రేమ ఉన్న చోటే పరమాత్ముడు ఉంటాడని హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను వికారాబాద్‌లోని జ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాబా ఒక వ్యక్తి కాదు.. ఆయన ఒక వ్యవస్థ అన్నారు. అందుకే సత్యసాయి సేవా సంస్థలు ప్రపంచంలోని అనేక దేశాల్లో వెలిశాయని కొనియాడారు. మానవ వికాసానికి శాస్త్రవిజ్ఞానం, దైవ విశ్వాసం రెండూ ముఖ్యమే అన్నారు. విశిష్ట అతిథి చంద్రశేఖర్ పట్నాయక్ మాట్లాడుతూ.. నిష్కామ కర్మతో చేసిన ఏ మంచి పనైనా సేవే అని పేర్కొన్నారు. పరమ సత్యాన్ని ఎవరో బోధించరనీ, నీకు నీవే తెలుసుకోవాలని తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ద్వారకానాథ్ మాట్లాడుతూ.. సత్యం ధర్మం శాంతి ప్రేమ అహింస అనే విలువలను బోధిస్తూ కోట్లాది మంది భక్తుల గుండెల్లో సత్యసాయి కొలువయ్యారని తెలిపారు. ప్రచారార్భాటానికి చేసే సేవ కీర్తి, ప్రతిష్టలు పెంచుతుందేమో కానీ.. అది సమాజానికి మంచి సందేశాన్ని, స్ఫూర్తిని ఇవ్వలేదన్నారు. అనంతరం మండల జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శాలువాలు కప్పి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సాయంకాలం దీపోత్సవం, స్వామి వారి డోలారోహణం, జవహర్ బాల్‌భవన్ ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు అనురాధ ఆధ్వర్యంలో పది మంది బాలికలు కూచిపూడి, భరతనాట్యం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ సత్యనారాయణగౌడ్, ఆధ్యాత్మిక సమన్వయకర్త బందప్పగౌడ్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ బసవరాజ్, పాపయ్య, సతీష్‌చంద్ర, మల్లయ్య, కపిల్ దేవ్, గోపాల్‌రెడ్డి, విఠోబా, వర్ధిని పాల్గొన్నారు.

చేవెళ్లలో ఘనంగా సత్యసాయి బాబా జయంతి వేడుకలు

చేవెళ్ల: సత్యసాయి బాబా వందో జయంతి సందర్భంగా ఆదివారం చేవెళ్లలోని సత్యసాయి మందిరంలో బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి జన్మదిన కేక్ కట్ చేశారు. దీంతో ప్రత్యేక భజనలు, కీర్తనలు ఆలపించారు. సాయంత్రం చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. దారి పొడవునా పచ్చటి తోరణాలు, సత్యసాయి ఫ్లెక్సీలు విద్యుత్ లైట్లతో అలంకరించారు. సాయిరాం నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కన్వీనర్ అయ్యావారి గోపాలచారి, కన్వీనర్ రామగౌడ్, మాజీ కన్వీనర్ మధుసూదన్, సభ్యులు మోహన్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వెంకట్‌స్వామి, విజయ్, బుచ్చిరాములు, సతీష్, వెంకటేశ్, భాస్కర్, శంకర్, మద్దెల విఠల్, పెంటారెడ్డి, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చేవెళ్లలో సత్య సాయిబాబా పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

తిరిగొచ్చిన ఉమ్రా యాత్రికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాలను దర్శించుకున్న యాత్రికులు ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. సౌదీలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై వారు స్పందించారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారు యాత్రలో తమతో మాట్లాడినట్లు తెలిపారు. మాట్లాడిన కాసేపటికే వారు ముందు బస్సులో ఉండగా ప్రమాదం జరిగిందన్నారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు. పుట్టిన ప్రతీ ఒక్కరికి మరణం తప్పదని, ఉమ్రా యాత్రలో చనిపోతే స్వర్గానికి వెళ్లినట్టు భావిస్తామన్నారు. 15 రోజుల క్రితం అందరం ఒకే విమానంలో వెళ్లి తిరిగి వారు లేకుండానే రావడం బాధాకరమన్నారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఉమ్రా యాత్రికులు

తండాలో తాగునీటికి తండ్లాట


హన్మనాయక్ తండాలో బోరు నీటి కోసం పొలాలకు వెళ్తున్న స్థానికులు

కులకచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని హన్మనాయక్ తండాలో తాగునీటి ఎద్దడి నెలకొంది. వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో తండా ప్రజలు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. నీటి కోసం సమీప వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. పొలం గట్లపై నుంచి నీరు తీసుకువస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక


జాతీయ జట్టుకు ఎంపికైన నరేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్థానికులు

కులకచర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అండర్-19 జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు మండలానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఇప్పాయిపల్లికి చెందిన మొగులయ్య కుమారుడు నరేశ్‌కుమార్ పరిగి గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17 నుంచి 20వరకు జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం నరేశ్‌కుమార్‌ను కులకచర్లలో సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, వెంకట్రాములు, రవికుమార్, వెంకట్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లకు పోరాడుదాం


బీసీ సంఘం సమావేశంలో నాయకుల అభివాదం

దోమ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రాతిపదికన 42శాతం రిజర్వేషన్లకు పార్టీలకతీతంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం నాయకులన్నారు. ఆదివారం దోమలోని టీటీడీ కల్యాణ మండపంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో జనాభాలో రిజర్వేషన్ లేకపోవడంతో వెనకబాటుకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొని ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, జగన్‌మోహన్, రామకృష్ణ, రామస్వామి, శాంతకుమార్, కేశవులు, గోవర్ధన్, వెంకటయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా ఆదివారం పరిగిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడీఎస్, ఎన్‌హెచ్‌ఎం, ఎండీఎంఎస్ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికుల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత గురించి సీఐటీయూ పోరాటం చేస్తుంటే బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికసంఘాల నాయకులు బాలయ్య, బాబయ్య, శంకరయ్య, మల్లేశ్, రాజు, లలిత, నర్సమ్మ పాల్గొన్నారు.


పరిగిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

పరిగిలో మూడు ఓపెన్ జిమ్‌లు

- తిరుమల వెంచర్, మినీ స్టేడియంలో జిమ్‌ల నిర్మాణం
- రూ.30లక్షలు వెచ్చించనున్న మునిసిపల్ శాఖ

పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఏర్పాటు

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):పరిగిలో ఓపెన్ జిమ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పరిగి పురపాలక సంఘం జిమ్ కేంద్రాల ఏర్పాటుకు సన్నహాలు చేస్తోంది. ఇందుకు రూ.30లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. ఈ జిమ్ సెంటర్ల ఏర్పాటుకు ఇటీవల డిప్యుటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన కూడా చేశారు. త్వరలోనే జిమ్‌ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ మొద టివారం నాటికి అందుబాటులో తెచ్చేలా అధికారులు కస రత్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యం కోసం వ్యాయామ కేంద్రాల ఏర్పాటు

పట్టణ వాకర్స్‌కు, వ్యాయామం చేసేవారి కల నేరవేర బోతోంది. పరిగిలో మూడు చోట్ల జిమ్‌లు ఏర్పాటు చేయా లని నిర్ణయించారు. ఒక్కో సెంటర్‌కు రూ.10లక్షల చొప్పున వెచ్చిస్తారు. మినీ స్టేడియంలో ఒకటి, తిరుమల వెంచర్ పార్కు జాగాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. తిరుమల వెంచర్ పార్కులో మహిళలు, పిల్లలకు, పురుషులకు వేర్వేరుగా జిమ్ములను ఏర్పాటు చేస్తారు. మహిళల జిమ్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న పరికారాల్లో ఆరు పిల్లలకు, ఎనిమిది మహిళలకు, పురుషుల సెంటర్‌లో 14 రకాల పరికరాలను అందుబాటులో ఉంచుతారు. మినీ స్టేడియంలోనూ 14 రకాల జిమ్ పరిక రాలను ఏర్పాటు చేస్తారు. జిమ్‌లలో ప్రత్యేక కార్పెట్ పరు స్తారు. లైటింగ్ సిస్టమ్ పెడతారు. తిరుమల వెంచర్‌లో ఏర్పాటయ్యే జిమ్‌లో నాలుగు వైపులా నాలుగు, మధ్యలో ఒకటి చొప్పున టవర్ లైటింగ్ సిస్టమ్‌ను అమర్చుతారు.


తిరుమల వెంచర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్న పార్కు స్థలం

ఈ జిమ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. త్వరలోనే పనులు ప్రారభి స్తారు. వాకర్లు, ప్రైవేట్ జిమ్ సెంటర్లకు వెళ్లే వారంతా ఈ కేంద్రాలను ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. ప్రజ లకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై వాకింగ్ నివారణకు ఈ కేంద్రాల్లో చుట్టూ వాకింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేస్తారు.

డిసెంబరులో అందుబాటులోకి తెస్తాం



రూ.30లక్షల వ్యయంతో పరిగిలో మూడు చోట్ల జిమ్ సెంటర్ల ఏర్పాటు చేస్తాం. తిరుమల వెంచర్‌లో మహి ళలు, పురుషులకు వేర్వేరుగా, మినీ స్టేడియం మైదానంలో ఒకటి పురుషుల కోసం జిమ్ము ఏర్పాటు చేస్తున్నాం. ఈ సెంటర్లలో ప్రత్యేకంగా లైటింగ్ సిస్టమ్ పెడతాం. ఈ జిమ్‌లు డిసెంబరు మొదటివారంలోగా ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

- వెంకటయ్య, కమిషనర్, పరిగి మునిసిపాలిటీ


ఇందిరమ్మ లబ్ధిదారులతో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చేవెళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధి ఊరెళ్లలో ఏర్పుల ఉష-అశోక్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహ ప్రవే శానికి ఎమ్మెల్యే యాదయ్య హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ.. అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పాలిట కల్పవృక్షం అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్లు దేవరవెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌ఛై ర్మన్ రాములు, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, కుంచం శివ కుమార్‌గుప్తా, మండల అధ్యక్షుడు వీరందేర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, జహంగీర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ నిర్వాసితులతో ఎమ్మెల్యే సమావేశం

కడ్తాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో సోమవారం సమావేశం కానున్నట్లు నాయకులు, అధికారులు తెలిపారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో నిర్వహించే సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరవుతారని వారు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే కడ్తాల మండలం ఎక్వాయిపల్లి, ముద్విన్, మర్రిపల్లి, అన్మా సపల్లి, ఆమనగల్లు మండల కోనాపూర్ గ్రామ రైతులు పాల్గొనాలని వారు కోరారు. సమావేశంలో పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే కు వివరించాలని సూచించారు.

రఘువీరారెడ్డి అనుచరుల నారాజ్...

- డీసీసీ చీఫ్ పదవి రాకపోవడంతో నైరాశ్యం
- పార్టీకి ఆయన చేసిన సేవలను నాయకత్వం గుర్తిస్తుందనే నమ్మకం


రఘువీరారెడ్డి

ధారూరు, నవంబరు 23(ఆంధ్ర జ్యోతి): మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారె డ్డికి డీసీసీ పదవొస్తుందని ఆయన అనుచరులు, కాంగ్రెస్ శ్రేణులు ఆశించారు. కానీ పార్టీ అధిష్ఠానం రఘువీరారెడ్డికి పదవి ఇవ్వకపోవ టంతో వారంతా నారాజయ్యారు. ఈ అంశంపై పార్టీలో, ఆయన అనుచరుల్లో చర్చ కొనసాగుతోంది. గతంలో అధిష్ఠాన పరిశీలకుల వద్ద ధారూరు, వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ ప్రాంత నాయకులు, ముఖ్య కార్యకర్తలు రఘువీ రారెడ్డికి డీసీసీ చీఫ్ పదవి ఇవ్వాలని తమ అభిమతాన్ని వ్యక్తం చేశారు. స్థానికంగా పార్టీ బలోపేతానికి రఘువీరారెడ్డి కష్టపడ్డారని, ప్రతిపక్షంలో పదేళ్లు ఉండి, బీఆర్ఎస్ పాలనలో ఎన్ని కేసులు పెట్టినా బెదరకుండా పార్టీని నడిపించారని నాయకులు, క్రియాశీల కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. పార్టీ పరిశీలకుల అభిప్రాయ సేకరణతో డీసీసీ పదవి కచ్చితంగా రఘువీరారెడ్డికే వస్తుందనే ధీమాగా ఉన్నామని, తీరా ధారాసింగ్‌ను కొత్త డీసీసీ చీఫ్‌గా ప్రకటించడంతో మండల నాయకులంతా డీలా పడిపోయారు. రఘువీరా డీసీసీ చీఫ్ అయితే మరింత ప్రభావం చూపి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదం చేసేదని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే తనకు డీసీసీ చీఫ్ పోస్టు రానందున పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరెడ్డి కూడా నిరాశగానే ఉన్నట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. కష్టకాలంలో పార్టీకి రఘువీరారెడ్డి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఆయనకు భవిష్యత్తులో పార్టీ లేదా ప్రభుత్వ పరంగా పద వులు అప్పగిస్తుందనే నమ్మకాన్ని అనుచరులు వ్యక్తం చేస్తున్నారు.

హైవే టెర్రర్!

(ఐదో పేజీ తరువాయి)

ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 1117 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. 393 మంది మృతి చెందారు. 1008 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తల్లి దండ్రులు మృతి చెందటంతో పిల్లలు అనాథలుగా మారారు. ఇప్పటికైనా ఈ హైవేపై 46 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేసి రోడ్డు ప్రమా దాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం మరువక ముందే ...

చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ స్టేజీ సమీపంలో ఈనెల 3వ తేదీన ఆర్టీసీ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో 19 మంది మృతి చెందగా, మరో 34 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే వరుసగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ నెల 20వ తేదీన ఖానా పూర్ స్టేజీవద్ద రోడ్డు పనుల కోసం అంతారం గ్రామం నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ వేగంగా వచ్చి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొ ట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వడ్డె శ్రీరామ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈనెల 21వ తేదీన మొయినాబాద్ మండలంలోని కనకమామిడి వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. చేవెళ్ల మండలంలోని దామరిగిద్ద స్టేజీ వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూసి ప్రజలు, వాహనాదారులు భయాందోళనలు చెందుతున్నారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు

హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ దారదారి 163, ఔటర్ రింగ్‌రోడ్డు పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు కొద్ది రోజులుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిత్యం ఈ హైవేపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ గా తీసుకున్నారు. విస్తరణ పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయా లని సంబంధిత నేషనల్ హైవే అధికారులకు ఆదే శాలు జారీ చేశారు.

బైపాస్‌ల నిర్మాణం

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి 46 కిలో మీటర్ల పరిధిలో 18 అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాల్లో బైపాస్ పనులు కొనసాగుతున్నాయి. మొయినాబాద్ వద్ద 4.35 కిలోమీటర్ల మేర, చేవెళ్ల వద్ద 6.35 కిలోమీ టర్ల మేర బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. బైపాస్ మధ్యలో అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. నాలుగు లేన్ల రహదారిగా విస్తరణలో భాగంగా పూడూరు మండలం చిట్టంపల్లి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేసేం దుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు.

విరిగిన బొల్లార్డ్స్

ఈ హైవేపై మొయినాబాద్ నుంచి మన్నెగూడ వరకు డివైడర్ లేకపోవడంతో ట్రాఫిక్ పోలీస్‌లు బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు మధ్యలో వీటిని ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కడిక క్కడ విరిగిపోయాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. ముందు వాహనాన్ని ఓవర్ టెక్ చేస్తూ వెళ్తున్న క్రమంలో బొల్లార్డ్స్‌ను ఢీకొట్టడంతో అవి పాడయ్యాయి.


ఇటీవల ఖానాపూర్ స్టేజి వద్ద చెట్టుకు ఢీకొన్న టిప్పర్(ఫైల్)

ప్రత్యేక చర్యలు అవసరం

హైదరాబాద్ -బీజాపూర్ హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ చూపాల్సిన అవ సరం ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండడం, వాహనాలు వేగంగా రావ డంతోనే ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయని పలువురు పేర్కొంటు న్నారు. అయితే మూలమలుపుల వద్ద ప్రత్యేక సూచిక బోర్డులు, బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తే వాహనాల వేగం నియంత్రించే అవకాశం ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంతో ఎన్‌హెచ్ అధికారులు గుంతలున్న చోట బీటీ వేసి చేతులు దులుపుకున్నారు. అయితే ప్రమాదాల నివారణ కోసం సూచిక బోర్డులు, రాత్రి పూట కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం మరిచిపోయారని విమర్శలు వస్తున్నాయి.

తొలగిన అడ్డంకులు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌హెచ్ఏఐ అధికారుల సమక్షంలో సేవ్‌బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణ వేత్తలతో పలు దఫాల్లో చర్చలు జరిపారు. కాగా, 954 చెట్లు కాపాడుతామని, 150 చెట్లు మాత్రమే రీ లొకేట్ చేస్తామని అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో కేసు విత్‌డ్రా చేసుకునేం దుకు అంగీకరించారు. ఈ మేరకు అలైన్‌మెం ట్‌లో మార్పులకు సంబంధించి పూర్తి రిపో ర్టును ఎన్జీటీకి సమర్పించడంతో అక్టోబరు 31వ తేదీన చెన్నయ్‌లోని గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో రోడ్డు విస్తరణ పనులు కొనసాగించ వచ్చని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ కేసును విత్ డ్రా చేసుకున్న పర్యావరణ వేత్తలను సీఎం రేవంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.


గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు విత్‌డ్రా చేసుకున్న తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పర్యావరణవేత్తలు




వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ధ్వంసం అయిన కార్లు(ఫైల్)

హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల వివరాలు

చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో				మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో			
సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు	సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2018	66	25	81	2018	64	13	64
2019	62	27	57	2019	97	16	97
2020	82	61	79	2020	67	08	67
2021	65	32	46	2021	56	23	34
2022	76	21	65	2022	59	18	39
2023	71	23	71	2023	76	34	78
2024	79	41	87	2024	49	14	65
2025	81	19	78	2025	67	32	65
మొత్తం	582	249	564	మొత్తం	535	144	444

రాత్రిపూట బావి పూడ్చివేత పనులు


రోడ్డుకు అడ్డంగా కొమ్మలు పెట్టి రాళ్ల టిప్పర్ అన్‌లోడ్ చేస్తున్నారిలా...


మర్రిపల్లిగూడలో రాత్రిపూట బండరాళ్లతో బావి పూడ్చుతున్న రియల్ వ్యాపారులు

- బండరాళ్లను డంప్ చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- రోడ్డును బ్లాక్ చేస్తూ పనులు కొనసాగిస్తున్న వైనం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23(ఆంధ్ర జ్యోతి) : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మర్రిపల్లి గూడలోని ఓ వ్యవసాయ బావిని రియల్‌ఎ స్టేట్ వ్యాపారులు పెద్ద రాళ్లతో పూడ్చుతు న్నారు. రాత్రిపూట టిప్పర్లలో రాళ్లు తెచ్చి పోస్తున్నారు. ఉదయం పూట ఎన్ఎఫ్‌సీనగ ర్ సమీప గుట్టను పగులగొట్టి రాత్రి సమ యంలో రాళ్లను టిప్పర్లల్లో లోడ్ చేసు కుంటూ బావిలో పోస్తున్నారు. ఈ వ్యవ సాయ బావి ఘట్‌కేసర్-ఎదులాబాద్ రోడ్డు పక్కనే ఉండటంతో ప్రమాదాలు జరుగకూ డదని గతంలో అధికారులు బావికి రక్షణగా పునాదిగోడ నిర్మించారు. రియల్ వ్యాపా రులు రక్షణగోడను కూల్చి రాళ్లతో నింపేస్తు న్నారు. ఈ వ్యవహారమంతా అధికారులు విధుల్లో ఉండని సెలవుదినాల్లో చేపడుతు న్నారు. రోడ్డుకు ఇరువైపులా నలుగురైదు గురు కర్రలతో నిలబడి వాహనాలను ఆపి బండరాళ్లను బావి డంప్ చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి లేకుండానే రాళ్లు కొట్టుకొచ్చి సాగుబావిని పూడ్చుతున్నారు. అలాగే రాత్రి పూట రోడ్డు వెంట వెళ్తున్న వాహనాలను ఆపుతుండ టంతో ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారు. వారిపై పోలీసులు చర్యలు తీసు కోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సేవాభావంతో వైద్యం చేయాలి



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 23(ఆంధ్ర జ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవాభా వంతో వైద్యం చేయా లని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్‌లోని శివగార్డెన్‌లో ఆదివారం అబాబిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యం చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేడు వైద్యాన్ని కూడా కొందరు డాక్టర్లు వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవ సరం ఉన్నా లేకున్నా వైద్య పరీక్షలు చేయిస్తున్నారని, అధిక మోతాదుల్లో మందులు రాస్తూ, బిల్లులను పెంచుతున్నారని అన్నారు. దేవుడి తరువాత దేవు డిగా భావించే వైద్యులు ఆర్థిక దోపిడీ చేయకుండా సేవా భావంతో వైద్యం చేస్తూ, మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. అబాబిల్ ఫౌండేషన్ వైద్య శిబిరం నిర్వహించి, మందులను పంపిణీ చేయడం అభినందనీయమని శంకర్ తెలిపారు. అనంతరం పటేల్ రోడ్డుకు చెందిన పి.అండాలు వైద్యం కోసం మంజూరైన రూ.2.5లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని అందజేశారు. కార్య క్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు హఫీజ్, అన్వర్, ఇర్ఫాన్, సాదిక్, నవాజ్, ఖాలేద్‌ఖాన్, అజర్, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి బస్వం, కె.చెన్నయ్య, జమృత్‌ఖాన్, వాసు, మనీశ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఇరిగేషన్ భవనం

- ఆమనగల్లులో సర్కారు ఆస్తి నిర్లక్ష్యం పాలు
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు
- వాడకం లేక స్థలం అన్యాక్రాంతమయ్యే ఆస్కారం

ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్ర జ్యోతి): పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆస్తులు వినియోగంలో లేక భవ నాలు శిథిలం అవుతున్నాయి. 30ఏళ్ల కింద ఆమనగల్లులో హైదరాబాద్ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఇరిగేషన్ శాఖ కార్యాలయాన్ని నిర్మించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది కొన్నాళ్లపాటు కార్యకలాపాలు సాగించారు. భవనాన్ని అనుసరించి శ్మశానవాటిక ఉండడంతో దాన్ని ఖాళీ చేశారు. నిరుప యోగంగా మారిన ఈ భవనం తలుపులు, కిటికీలు, టైల్స్, ఇతర వస్తువులు దుండగులు ఎత్తుకపోయారు. పదేళ్ల క్రితం రూ.2లక్షలు వెచ్చించి మరమ్మతులు చేశారు. అయినా వినియోగంలో లేక పశువుల ఆవాసంగా మారింది. పొదలతో నిండింది. కోట్ల రూపా యల విలువ చేసే సర్కారు స్థలం అన్యా క్రాంతమయ్యే పరిస్థితి ఉంది. పూర్వపు పంచాయతీ సమితి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో ఎక్కడా నీటి పారుదల శాఖకు కార్యాలయం లేదు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికా రులు ఎక్కడుంటారో, ఏం పని చేస్తారో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో నాలుగు మండలాలకు అనువుగా ఉండే ఈ కార్యాలయాన్ని వినియోగంలోకి తెస్తే చెరువులు, కుంటలు, ఇతర చిన్ననీటి వనరుల పర్యవేక్షణకు అధికారులు అందుబాటులో ఉండి రైతులకు, ప్రజ లకు సేవలందించే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఇరిగేషన్ ఏఈ, డీఈఈ కార్యాల యాల ఏర్పాటుకు ఏళ్లుగా డిమాండ్ ఉంది. అయితే ఆ దిశగా ఎవరూ చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతా ధికారులు స్పందించాలని రైతులు, ప్రజాప్ర తినిధులు కోరుతున్నారు.



కార్యాలయం లేక ఇబ్బంది



ఆమనగల్లులో ఇరిగేషన్ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రత్యే కంగా భవనం లేక ఆ శాఖ అధికారులు మండల పరిష త్‌కు అప్పడప్పుడు వచ్చిపో తున్నారు. నిరుపయోగంగా ఉన్న నీటిపారుదల శాఖ భవనానికి మరమ్మతులు చేయించి వినియోగం లోకి తెచ్చి అధికారులను రైతులకు అందుబాటులో ఉంచాలి. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉన్న తాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- కండె హరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ, ఆమనగల్లు

ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతాం



ఆమనగల్లు ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవ నాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కృషిచేస్తాం. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ డివిజన్ కార్యాలయ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి, ఎంపీ మల్లు రవి లు కూడా కార్యా లయం గురించి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారు లతో మాట్లాడారు. భవనాన్ని ఆధునికీకరించేలా ప్రభుత్వంతో మాట్లాడతాం.

- మండ్లీ రాములు, మాజీ ఎంపీటీసీ, ఆమనగల్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మొల్లగూడకు చెందిన గిరిధర్(24) ఆదివారం సాయంత్రం మేడ్చల్ మండలం అక్బర్‌పేటలో బంధువుల విందు కార్యక్రమంలో పాల్గొన్నాడు. తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తుండగా పూడూరు శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొన్నాడు. దీంతో గిరిధ ర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కరపత్రాలను అందజేస్తున్న లక్ష్మణ్

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆమనగల్లు పట్టణంలో సమగ్ర గృహ సంపర్క ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. జాతిసేవలో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకుందని మాజీ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ చెప్పారు. శతాబ్ది ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సేవకులు ఇంటింటికీ వెళ్లి ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రయాణాన్ని వివరించాలని లక్ష్మణ్ సూచించారు. దేశ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతలు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

రేపు కొబ్బరికాయల వేలం

తలకొండపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో స్నేహలత ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న నిర్వహించే కొబ్బరికాయలు, లడ్డూల వేలం పాట కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ వద్ద వసతుల కల్పనకు వినియోగిస్తున్నట్లు స్నేహలత తెలిపారు.

పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు!

నివేదిక సిద్ధం చేసిన అధికారులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

కొత్తూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పల్లెల్లో పంచాయతీ జోష్ నెలకొంది. ఈమేరకు రిజర్వేషన్లు దాదాపు ఖరారు చేశారు. మండలంలోని 12 గ్రామపంచాయతీల రిజర్వేషన్లు ఆదివారం దాదాపు ఖరారయ్యాయి. గూడూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవీ(జనరల్), ఇన్ముల్‌నర్వ (జనరల్ మహిళ), కొడిచర్ల (ఎస్సీ మహిళ), కొడిచర్ల తండా (ఎస్టీ మహిళ), మక్తగూడ (బీసీ జనరల్), మల్లాపూర్‌తండా (ఎస్టీ మహిళ), మల్లాపూర్(జనరల్), పెంజర్ల(ఎస్సీ జనరల్), ఎస్‌బీ పల్లి (జనరల్ మహిళ), సిద్దాపూర్ (ఎస్టీ జనరల్), తీగాపూర్ (జనరల్) వైఎం తండా (ఎస్టీ జనరల్) రిజర్వేషన్లు కేటాయించినట్లు సమాచారం. స్థానిక అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను అందజేసినట్లు తెలిసింది.

కొందుర్గు : మండలంలోని 22 గ్రామపంచాయతీలో సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారైనట్లు సమాచారం. జనరల్ 6, జనరల్ మహిళ 5, బీసీ జనరల్ 2, బీసీ మహిళ 2, ఎస్సీ జనరల్ 3, ఎస్సీ మహిళ 3, ఎస్టీ మహిళ 1 స్థానాలను కేటాయించినట్లు సమాచారం.

చౌదరిగూడ : మండల పరిధిలోని 24 పంచాయతీలలో అధికారులు రిజర్వేషన్లు దాదాపు ఖరారు చేశారు. జనరల్ 6, జనరల్ మహిళ 5, బీసీ మహిళ 3, బీసీ జనరల్ 3, ఎస్సీ మహిళ 2, ఎస్సీ జనరల్ 2, ఎస్టీ జనరల్ 2, ఎస్టీ మహిళ 1 రిజర్వేషన్లు కేటాయించారు. మండలంలో మొత్తం 31,662 మంది ఓటర్లు ఉన్నారు.

నందిగామ/షాద్‌నగర్ రూరల్ : నందిగామ మండలంలో 19 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈమేరకు దాదాపు అన్ని రిజర్వేషన్లు ఖరారు చేశారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండలంలో 47 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని స్థానాల్లో రిజర్వేషన్లు ప్రకటించారు.

మహేశ్వరం : మండల పరిధిలోని 30 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్లను అధికారులు విడుదల చేశారు. రిజర్వేషన్లు ఖరారు చేయడంతో గ్రామాల్లో సందడి మొదలైంది.

కందుకూరు : మండలంలోని 35 గ్రామ పంచాయతీలు, 312 వార్డులకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్టీ జనరల్ 3, ఎస్టి మహిళ 2, ఎస్సీ జనరల్ 4, ఎస్సీ మహిళ 4, బీసీ జనరల్ 3, బీసీ మహిళ 3, జనరల్ 8, జనరల్ మహిళ 8.. రిజర్వేషన్లను అధికారులు విడుదల చేశారు.

ఇబ్రహీంపట్నం : మండలంలో 14 గ్రామ పంచాయతీలకుగాను సర్పంచుల రిజర్వేషన్లు ఖరారైనాయి. కాగా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

మంచాల : మండల పరిధిలో మొత్తం 23 గ్రామపంచాయతీలు ఉండగా ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికను బట్టి.. ఎస్టీలకు 6, ఎస్సీలకు 4, బీసీలకు 2 సీట్లు కేటాయించారు. మిగిలిన 11 గ్రామ పంచాయతీలను జనరల్ సీట్లుగా ఎంపిక చేశారు.

యాచారం : మండలంలోని 24 గ్రామపంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 232 వార్డు మెంబర్లకు గాను ఎస్టీ 28, ఎస్సీ 55, బీసీ 41, జనరల్ 108 కేటాయించారు.

ఆమనగల్లు : మండలంలో పంచాయతీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. కాగా, అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. 13 గ్రామ పంచాయతీలకు గాను జనరల్ 6, ఎస్సీ 3, ఎస్టీలకు 4, వాటిలో 7 మహిళలకు కేటాయించారు.

తలకొండపల్లి : మండలంలో పంచాయతీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. 32 జీపీలకు గాను 12 జనరల్, 6 ఎస్సీ, 10 ఎస్టీ, బీసీలకు 4, వాటిలో 20 మహిళలకు కేటాయించారు.

కడ్తాల్ : మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను 12 ఎస్టీలకు, ఎస్సీలకు 3, బీసీ 1, జనరల్‌కు 8 రిజర్వేషన్లు కేటాయించినట్లు సమాచారం.

చేవెళ్ల : చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లోని ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లు ఆదివారం చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, చేవెళ్ల డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి, ఆయా మండలాల ఎంపీడీలు, తహసీల్దార్ల సమక్షంలో సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల సీట్లతో పాటు పురుషులు, మహిళల పోటీ అభ్యర్థుల సీట్లు రిజర్వేషన్లు లాటరీ విధానం ద్వారా కేటాయించి ప్రకటించారు.

చేవెళ్ల మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలకుగాను రిజర్వేషన్లు ప్రకటించారు. ఎస్సీలకు ఆరు స్థానాలు కాగా ముగ్గురు మహిళ, ముగ్గురు పురుషులు, బీసీకు 6 స్థానాలు ఉండగా ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. మిగిలిన 13 జనరల్ స్థానాలు ఇందులో 6 స్థానాలు మహిళ, 7 స్థానాలు పురుషులకు కేటాయించారు.

మొయినాబాద్ : మండలంలో 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి.. ఎస్సీ 4 కాగా.. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు. బీసీ 5 స్థానాలకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు. జనరల్ 10 స్థానాలు ఇందులో 5 మంది మహిళలు, 5 మంది పురుషులు ఉన్నారు.

శంకర్‌పల్లి : పరిధిలో 24 జీపీలకుగాను ఎస్సీలకు ఆరు స్థానాలు కేటాయించగా.. ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు. బీసీలకు 4 కేటా యించగా.. ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు. జనరల్‌కు 12కేటాయించగా.. పురుషులు 6, మహిళలు 6 ఉన్నారు.

షాబాద్ : మండలంలో 41 గ్రామ పంచాయతీలకు గాను.. ఎస్సీలకు 9కి గాను మహిళ 4, పురుషులకు 5, ఎస్టీలకు ఒక జనరల్ స్థానం కేటాయించారు. బీసీ 10 స్థానాలకు.. పురుషులు 5, మహిళలు 5, జనరల్‌కు 21 మందికి గాను 11 మంది పురుషులు, 10 మంది మహిళలకు అధికారులు రిజర్వేషన్లు కేటాయించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కొందుర్గు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైన ఘటన కొందుర్గు మండల కేంద్రం చెక్కులోనిగూడలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చెక్కులోనిగూడకు చెందిన బోయ అంజయ్య పెంకుటింట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు అంటుకొని సామగ్రి దగ్ధమైంది. బీరువాలో ఉన్న బట్టలు, రూ.లక్ష నగదు, బియ్యం ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలార్పడానికి ప్రయత్నం చేసినప్పటికీ నష్టం జరిగిపోయింది. బాధితుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బిల్డింగ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

ఆదిభట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో చోటు ఆదివారం చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం మేరకు.. నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రవెల్లికి చెందిన కుంచెం శ్రీశైలం(30) తన తమ్ముడి పెళ్లి శుభలేకను.. తన మామకు ఇవ్వడానికి తుర్కయాంజాల్‌కు శనివారం రాత్రి వచ్చాడు. రాత్రి 10 గంటల సమయంలో అత్తామామలతో కలిసి భోజనం చేశాడు. అనంతరం బిల్డింగ్‌పై పండుకుంటానని చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో శ్రీశైలం ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి 2గంటల సమయంలో కుక్కలు అరవడంతో అతడి మామ నిద్రలేచి చూడగా శ్రీశైలం తీవ్రగాయాలతో అచేతన స్థితిలో పడి ఉండటం గమనించాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి తమ్ముడు ముత్యాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

'డబుల్' ఇళ్లు ఇప్పిస్తానని మోసం

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- రూ.లక్షల్లో వసూలు చేశారని ఆరోపణ

ఆదిభట్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై ఆదిభట్ల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బాధితులు నాగుల భిక్షపతి, మోతె రవి, రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం కుర్మల్‌గూడకు చెందిన కళ్లెం అంజయ్య మరి కొంతమంది వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తామని వికారాబాద్, శంషాబాద్, అజీజ్‌నగర్, మహబూబ్‌నగర్, తాండూర్, హైదర్స్‌కోట, బషీర్‌బాగ్‌కు చెందిన సుమారు 4 వేల బాధితుల వద్ద దాదాపు రూ.6 వేల నుంచి రూ.50 వేల వరకు డబ్బులు వసూల్ చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నప్పటి నుంచీ ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలిపారు. నాలుగేళ్లుగా ఇళ్లు ఇవ్వడం లేదని అంజయ్యను నిలదీస్తే బెదిరింపులకు గురిచేస్తున్నాడని వాపోయారు. నకిలీ పత్రాలు సృష్టించి డబ్బులు వసూల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈమేరకు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం : మల్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం : చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో ఆదివారం ఎమ్మెల్యే మహిళా సంఘాల సభ్యులకు ఇందిర మహిళా శక్తి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్ రెడ్డి, ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్ ఏదుళ్ల పాండురంగారెడ్డి, ఏపీఎం సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న గీత

ఆమనగల్లు : మహిళల సాధికారిత, ఆత్మగౌరవం పెంపే లక్ష్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ కార్యాలయంలో ఆదివారం వి లేకరుల సమావేశంలో గీత మాట్లాడు తూ మహిళల సంక్షేమ, ఆర్థికాభివృద్ధి, భ ద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నా రు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మా డ్గుల మండలాల్లో నేడు(సోమవారం) ఇందిర మ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు మండలాల పరిధిలో 3.114 సంఘాలకు మంజూరైన 34,560 చీరల ను ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు చీరల పంపిణీ

కందుకూరు/చేవెళ్ల : ఇందిరమ్మ చీరలను నేడు(సోమవారం) మండల కేంద్రంలో పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11:30 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. అలాగే చేవెళ్ల మండల కేంద్రంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం భీమయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై చీరలు పంపిణీ చేస్తారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీఎం కోరారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు రాజు

చౌదరిగూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రపల్లి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన కార్యకర్తలపై ఉందన్నారు. మాజీ సర్పంచులు యాదయ్య, శివ, అంజనేయులు, నర్సింహులు, పాపయ్య, నాగేందర్, రాంచంద్రయ్య, యాదగిరి గౌడ్, బాలయ్య అఫ్సర్, ఎలీశ్వర్, సంజీవరెడ్డి, సత్యయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కేశంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. కొనాయపల్లికి చెందిన గుండెమోని జంగమ్మ, నిర్ధవెల్లికి చెందిన రహీంలు ఆదివారం మృతిచెందారు. కుటుంబ సభ్యులను విశాల ఫోన్‌లో పరామర్శించారు. చెరో రూ.5వేలు నాయకుల ద్వారా అందించారు.

'పట్నం' మున్సిపాలిటీలో నేడు నీటి సరఫరా బంద్

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గౌరీదేవిపల్లి హెడ్ వర్క్స్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నేడు(సోమవారం) మిషన్ భగీరథ నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుంటూ మున్సిపల్ వాటర్ సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు



కడ్తాల : వేడుకల్లో సత్యసాయి భక్తులు

కడ్తాల్/ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్ర జ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆమనగల్లు పట్టణం, కడ్తాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి, సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సాయి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక సాయి మందిరాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఉదయం ఓం కారం, సుప్రభాతం, మహానగర సంకీర్తనతో జయంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయిభక్తులు పాల్గొని సాయిసంకీర్తనలు, భజనలు, సాయి పాటలు ఆలపించారు. సాయి చిత్రపటం వద్ద భజనలు, పూజలు చేపట్టారు. సాయంత్రం భజనలు, డోలారోహణం, హారతి, , కేక్ కటింగ్, స్వామి సందేశం కార్యక్రమాలు నిర్వహించారు.

జీవనశైలి మార్పుతో మధుమేహం నియంత్రణ

కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జీవన శైలిలో మార్పుతో మధుమేహాన్ని నియంత్రించవచ్చని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమనగల్లు లయన్స్ క్లబ్, లియోక్లబ్, సత్యసాయి భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి గంప శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్‌లతో కలిసి శిబిరాన్ని చెన్నకిషన్ రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో 120 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శారద బిచ్యానాయక్, బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్, లయన్స్‌క్లబ్ సభ్యులు, సత్యసాయి భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ పవన్‌కుమార్ రెడ్డి

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం

మొయినాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో యువనాయకుడు షాపురం రాజు సొంతడబ్బులతో 16 సీసీ కెమెరాలను రూ.2లక్షల 30వేల రూపాయలతో ఏర్పాటు చేయగా ఆదివారం సీఐ పవన్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, దేవాలయాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎస్సై నయీమొద్దీన్, గ్రామస్థులు యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 60మంది విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనానికి ప్లేట్లు సమకూర్చారు. సభ్యులతో విద్యార్థులకు గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ వాటిని అందజేశారు. కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు, హెచ్‌ఎం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి : యాదయ్య



శంకర్‌పల్లి : మోకిలలో నిర్వహించిన పూజలో ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలోని ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయం 5వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన కల్గి ఉండాలని సూచించారు. దైవనామస్మరణతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, నిర్వహకులు తదితరులు ఉన్నారు.

దైవారాధనతో మానసిక ప్రశాంతత

కొందుర్గు : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవలని, దైవారాధనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు. కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండాలో శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్దన్‌రెడ్డి మాట్లాడుతూ హనుమంతుడి ఆశీర్వాదంతో అయోధ్యపూర్ తండా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని భగవంతుడిని ఆరాధించినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్, గోపాల్ నాయక్, మంగులాల్, గోపి నాయక్, లక్ష్మీకాంత్ రెడ్డి, బోయ అశోక్, బోయ శేఖర్, పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు : ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనతో వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆలయ మండపం నిర్మాణానికి విరాళం

కేశంపేట : మండల పరిధిలోని కొత్తపేట గ్రామం ముదాద్‌పురం సిద్ధి రామలింగేశ్వర స్వామి ఆలయంలో మండపం నిర్మాణానికి కొత్తపేట మాజీ సర్పంచ్ కె.నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్‌లు ఆదివారం ఆలయ నిర్వాహకులకు రూ.50,000 విరాళం అందజేశారు. మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జమాల్ ఖాన్, మాజీ వార్డుసభ్యులు జగన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేష్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రొయ్యల అంజయ్య, సాయిలు, జంగయ్య, అంజయ్య, నాయకులు రాజు, కృష్ణ, భాను, గణేష్, తదితరులున్నారు.



కొందుర్గు : ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, హనుమాన్ పూజలో పాలమూరు విష్ణువర్దన్ రెడ్డి తదితరులు

పుస్తె, మెట్టెల వితరణ



పుస్తె, మెట్టెలు అందిస్తున్న విష్ణువర్దన్‌రెడ్డి తల్లిదండ్రులు

కేశంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డ వివాహం సందర్భంగా కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్దన్‌రెడ్డి పుస్తె, మెట్టెలు వితరణ చేశారు. గ్రామానికి చెందిన వడ్డె పోచమ్మ-సత్తయ్యల కూతురు వైశాలి వివాహం ఆదివారం జరిగింది. మాజీ సర్పంచ్ తల్లిదండ్రులు తాండ్ర బాల్‌రెడ్డి, విజయలక్ష్మి చేతులమీదుగా పుస్తె, మెట్టెలు అందజేశారు. వారితో పల్లాటి సీనయ్య, గూడ శేఖర్, తాండ్ర కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించుకుందాం

చౌదరిగూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఓటర్ జాబితా ముసాయిదాపై సమావేశం నిర్వహించారు. అనంతరం 24 గ్రామ పంచాయతీలోని వార్డులవారీగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. ఎంపీవో హన్మంత్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, బీఆర్ పార్టీ మండలాధ్యక్షుడు హఫీజ్, టీడీపీ నాయకులు రజాక్, బీఎస్పీ మండలాధ్యక్షుడు చెన్నయ్య వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు



కడ్తాల : చీరలు పంపిణీ చేస్తున్న ఉప్పల వెంకటేశ్, గంప వెంకటేశ్, దశరథ్ నాయక్

ఆమనగల్లు/కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ అధ్యక్షులు నేనావత్ పత్యనాయక్, కడారి రామకృష్ణల ఆధ్వర్యంలో ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమాలకు మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, అనురాధపత్యనాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌లు హాజరయ్యారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌లు కట్‌చేసి ప్రజలకు పంచి పెట్టారు. పెద్దఎత్తున బాణసంచా పేల్చారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడ్తాలలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు చుక్క నిరంజన్, నాగిల్ల జగన్, జ్యోతయ్య, కమటం వెంకటయ్య, సయ్యద్ ఖలీల్, డేరంగుల వెంకటేశ్, రమేశ్ నాయక్, గణేశ్, శ్రీనునాయక్, పంతూనాయక్, మణిపాల్ నాయక్, రమేశ్, రామకృష్ణ, పాండు, బికుమాండ్ల రాము, వీరేంద్ర, వీరేశ్,సాయి, లాయక్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : కేక్‌కట్ చేస్తున్న వెంకటేశ్, పత్యానాయక్

'ఇందిరమ్మ'తో సొంతింటి కల సాకారం



ప్రొసీడింగ్స్ అందిస్తున్న నాయకులు

తలకొండపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేదల సొంతింటి కల సాకారమవుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్‌లు అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం దశలవారిగా ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో 45మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. ఆదివారం మంజూరు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో ఇళ్లు మంజూరైనట్లు వారు తెలిపారు. నాయకులు రమేశ్, నర్సింహారెడ్డి, నర్సింహ, పాండు, గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో ఆనందమే లక్ష్యం

శంకర్‌పల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పేదల కళ్లలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శంకర్‌పల్లి మండలం జన్వాడకు చెందిన కుమ్మరి అనురాధ, రంగం నవీన్ కుమార్‌లు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి భీంభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోడి కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, శివ, ఇంద్రారెడ్డి, సురేందర్, యాదయ్య, రమేష్ నాయక్, శంకర్‌నాయక్, మల్లేష్, శేఖర్, శ్రీశైలం, అనిల్, అశోక్, మాజీ ఎంపీటీసీ మైసయ్య, గ్రామస్తులు, నాయకులు తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో భీంభరత్ నాయకులు